క్లుప్తంగా

అక్రమ అరెస్టులతో కూటమి పైశాచిక ఆనందం


రుద్రరాజు చిన్నారాజా

మలికిపురం: వైఎస్సార్ సీపీ అగ్రనేతలను అరెస్టు చేయడం ద్వారా కూటమి నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నారాజా అన్నారు. ఆదివారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ పి.మిధున్‌రెడ్డిని మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. దీనిపై ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. జిల్లా పార్టీ నూతన అధ్యక్షుడిగా జగ్గిరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పార్టీలో నూతనోత్తేజంతో నాయకులు ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాగే రాజోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారని చిన్నరాజా అన్నారు.

నేడు వేణుగోపాలస్వామి శాంతి కల్యాణం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీసత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణం జరగనుంది. దీంతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు అంగర గోపాలాకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్ష తులసి పూజ, శాంతి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అలాగే శాంతి కల్యాణాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది. ఈ శాంతి కల్యాణం, లక్షతులసి పూజను కనులారా వీక్షించేందుకు భక్తులకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

రోడ్డు అభివృద్ధి చేయాలంటూ నిరసన


నగరంలో రోడ్డు అభివృద్ధి చేయాలంటూ నిరసన తెలుపుతున్న స్థానికులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాడివారిమెరక రోడ్డు పరిస్థితి దారుణంగా ఉందని దాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆదివారం నిరసన తెలిపారు. రోడ్డుపై గోతులు ఏర్పడిన ప్రాంతంలో నిల్చుని తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. 14 నెలల నుంచి రోడ్డు ఆధునీకరించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు పాడైపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం దిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ నిరసనలో మీర్జా ఇలియాస్ హుస్సేన్, మహ్మద్ ఖ్రమే అబ్బాస్, కుడుపూడి ప్రసాద్, అన్వర్ నవాబ్ జాన్, ఇక్బాల్ హుస్సేన్, పెదపూడి రాజేష్ పాల్గొన్నారు.

నిత్యం శ్రీకృష్ణుని స్మరణలో ఉండాలి

అయినవిల్లి: దేవాధి దేవుడు శ్రీకృష్ణుని నామస్మరణతోనే నిత్యం ఉన్నవాడే భగవాన్ శ్రీకృష్ణుని ధామం చేరుకుంటారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ ప్రభూజీ తెలిపారు. ఆదివారం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో భగవాన్ శ్రీకృష్ణునికి సుందరశ్రీనివాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. సుందర శ్రీనివాస్ ప్రభూజీ భగవద్గీత పారాయణ చేశారు. భక్తులతో నామ సంకీర్తన చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు జరిపారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 27 మంది, లక్ష్మీగణపతిహోమంలో 13 జంటలు, ఇరువురు చిన్నారులకు తులాభారం, ఓ చిన్నారికి అన్నప్రాశన నిర్వహించారు. స్వామికి ముగ్గురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 37 మంది వాహన పూజలు చేయించుకున్నారు. ఆదివారం ఒక్క రోజు స్వామికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,09,826 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, ఏసీ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

అధ్వానంగా పుంతరోడ్లు

- చిరుజల్లులకే చిత్తడి చిత్తడి
- బురదలో నుంచే నడచి వెళుతున్న రైతులు
- ఉపాధి హామీ పనుల్లో కొరవడిన పర్యవేక్షణ


అధ్వాన స్థితిలో చింతలూరు నుంచి జొన్నాడ వెళ్లే పుంతరోడ్డు


సంధిపూడిలో అధ్వానంగా మారిన పెద్ద కాలువ పుంతరోడ్డు

ఆలమూరు: ఉపాధి హామీ పథకం నుంచి రూ.కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నా గ్రామీణ ప్రాంతాలు మాత్రం అభివృద్ధి చెందడం లేదు. రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ సభలు, సమావేశాల్లో రైతులను విపరీతమైన పొగడ్తలతో ముంచెత్తుతారు. ఓవక్క రైతు దేశానికే వెన్నెముక అంటూనే పంటలు పండించే సమయంలో మాత్రం కనీస సదుపాయాలు కల్పించడం లేదు. ఈఏడాది ఎన్‌ఆర్‌జీఈఎస్ కింద కొత్తపేట నియోజకవర్గంలో సుమారు రూ.40 కోట్లతో పనులు చేపట్టినా ఒక పుంతరోడ్డును అభివృద్ధి చేయడం లేదు. రైతుల నుంచి రూ.కోట్లను నీటి తీరువా, సెస్ రూపంలో పన్నులుగా వసూలు చేస్తున్న ప్రభుత్వం వారికి అవసరమైన, ఉపయోగమైన పుంతరోడ్లను మాత్రం పట్టించుకోవడం లేదు. పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు, వ్యవసాయ పనులను చేపట్టేందుకు కనీస అభివృద్ధి చేయాల్సిన పుంతరోడ్లను ఏళ్ల తరబడి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రైతలకు మనోవేదనకు గురిచేస్తుంది. నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు, రావులపాలెం వ్యవసాయ మార్కెట్ పరిధిలో సొమ్ము నిల్వలు పుష్కలంగా ఉన్నా ఏ విధమైన ప్రయోజనం కనిపించడం లేదు. రైతుల అభ్యున్నతికి, పుంతరోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తుంది.

రైతుల 'నడక'యాతన

రైతుల సమస్యలపై అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో అనేక గ్రామాల్లో దశాబ్దకాలం కిందట నిర్మించిన అనేక రోడ్లు చిత్తడి చిత్తడిగా మారి బురదగుంటలను మరపిస్తున్నాయి. వర్షాలు కురిసే సమయంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదనే రైతులు బాధపడుతున్న తరుణంలో పొలాలకు వెళ్లేందుకు కూడా సరైన సదుపాయాలు లేక విలవిల్లాడుతున్నారు. తమతమ పశువుల మకాంకు వెళ్లి పాలు తీసుకువచ్చేందుకు బురదగుంటల్లోనే వెళ్లాల్సి రావడంతో తీవ్ర ప్రయాసలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లే అవకాశం లేకున్నా కనీస నడవడానికి కూడా పరిస్థితి అనుకూలించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు గడ్డిని కోసుకుని వాహనాల మీద తరలిద్దామంటే రవాణా సౌకర్యాలు అనువుగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెస్‌ల రూపంలో రైతులు రూ.కోట్లు చెల్లిస్తున్నా ఆ మేరకు అభివృద్ధి చేయకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది.

ప్రకటనలకే పరిమితం

కేంద్ర ప్రభుత్వ నిధులతో రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు వీలుగా పుంతరోడ్లను అభివృద్ధి చేస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితో అవసరం లేని చోట కూడా సీసీ రోడ్లు నిర్మిస్తున్న అధికారులు మాత్రం పుంతరోడ్లు నిర్మాణానికి వచ్చేసరికి పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇకనైనా పాలకులు సత్వరమే స్పందించి పుంతరోడ్లును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే ప్రజలు కోరుతున్నారు. ఉపాధి నిధులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక


కేశనపల్లి గ్రామ నూతన కమిటీని అభినందిస్తున్న మోకా సురేష్, గుర్రం జాషువా

మలికిపురం: మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం వైఎస్సార్ సీపీ నూతన కమిటీల ఎంపిక జరిగింది. కేశనపల్లి నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా యడ్ల జయకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అడబాల లీలాకృష్ణ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గుడిమెళ్లంక నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా బల్ల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.వీవీ సత్యనారాయణలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో మలికిపురం మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ పార్టీ గ్రామ కమిటీ బలోపేతంగా పార్టీ కార్యకలాపాలు విస్తృతం అవుతాయన్నారు. ఆయా కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తున్నామన్నారు. ఎంపికలకు పరిశీలకుడిగా మంగెన సింహాద్రి, జిల్లా సెక్రటరీ కార్యదర్శి మోకా సురేష్, రాజోలు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా, గుబ్బల రమేష్, యెనుముల నారాయణస్వామి, పెన్మెత్స రంగరాజు, కలగత ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


ప్రేమానందాన్ని పరామర్శిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: గ్రామ శాఖ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నల్లి ప్రేమానందాన్ని ఆదివారం ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చిన ఆయన యోగ క్షేమాలు గురించి గొల్లపల్లి అడిగి తెలుసుకున్నారు. వెంట మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, జిల్లా జనరల్ సెక్రటరీ ఈద రవిరెడ్డి, మోరి గ్రామ శాఖ అధ్యక్షుడు బళ్ళ వీర్రాజు, నాయకుడు నల్లి రక్షణ పాల్గొన్నారు.


దుర్గాప్రసాద్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

ప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

మామిడికుదురు: అనారోగ్యం బారిన పడి విశ్రాంతి తీసుకుంటున్న మామిడికుదురు మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్‌ను ఆదివారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, జనసేన నేత నల్లా అజయ్ పరామర్శించారు. పాశర్లపూడిలో దుర్గాప్రసాద్‌ను అతని ఇంటి వద్ద పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారి వెంట పార్టీ నేతలు కొమ్ముల రాము, తులా గోపాలకృష్ణ, చిక్కం బుజ్జిబాబు, పిల్లి శ్రీనివాస్, యేడిద లక్ష్మణరావు, తులా బ్రహ్మాజీ, అడ్డగళ్ల శ్రీనివాస్, కట్టా రామకృష్ణ ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1.50 లక్షల విరాళం

రాజోలు: ఆర్టీసీ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రాజోలు బస్టాండ్‌లో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ.1.50 లక్షల విరాళాన్ని దాత రుద్రరాజు రంగరాజు డిపో మేనేజర్ ధనమ్మకు ఆదివారం అందజేశారు. ఇటీవల జోన్-2 ఈడీ డిపో పరిశీలనకు వచ్చిన సందర్భంగా ప్రయాణికులకు రక్షిత తాగునీరు అందించాలని డీఎం ధనమ్మకు సూచించారు. దీంతో డీఎం ధనమ్మ, అసిస్టెంట్ మేనేజర్ కేకే దొర లక్కవరం గ్రామానికి చెందిన దాత రుద్రరాజు రంగరాజును సంప్రదించి సమస్యను వివరించారు. వెంటనే రంగరాజు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌కు రూ.1.50 లక్షల విరాళాన్ని ఇచ్చారు. దాత రంగరాజు, ఆయన కటుంబ సభ్యులను జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాఘవ కుమార్, డీఎం ధనమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ముదునూరి సాయిరాజు, అరిగెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విరాళాన్ని డీఎం ధనమ్మకు అందిస్తున్న దాత రంగరాజు

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యులందరూ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. ఆలమూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన నిర్వహించిన ఏఎంసీ కార్యవర్గం అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన మహిళ నేత కొత్తపల్లి వెంకటలక్ష్మి, ఆలమూరుకు చెందిన వైస్ చైర్మన్ కేతా రాంబాబుతో పాటు సభ్యులైన ఆకుల రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్‌కుమార్, దండే శ్రీదేవి, డి.మంగాలక్ష్మి, కాలా సత్యవేణి, గాడ మంగ, గుత్తుల నాగేశ్వరరావు, కొమ్ము దేవి, నామాల సూర్యనారాయణమూర్తి, రాయుడు నాగరామదుర్గ, టి.సీతారామలక్ష్మి, తోరాటి సత్యకిషోర్, వెత్సా సుబ్బారావును అభినందనలు తెలియజేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులందరినీ మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు ఘనంగా సత్కరించి మెమెంటో బహూకరించారు. అలాగే ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటలక్ష్మి నేతృత్వంలో జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, టీడీపీ నేతలు ఆకుల రామకృష్ణ, ఈదల సత్తిబాబు, వంటిపల్లి పాపారావు తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరులో మంత్రి సుభాష్‌కు మెమెంటో బహూకరిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి

పూర్వ విద్యార్థుల సాయం

పి.గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న తమ తోటి విద్యార్థికి 1986–87 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రూ.25 వేల సాయం అందించారు. పి.గన్నవరం శివారు చిట్టిలంకపేటకు చెందిన చింతా అబ్బులు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం మొదటి విడతగా రూ.25 వేలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, సుంకర వెంకట కృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ నాయుడు, నూకపెయ్యి ఏడుకొండలు, వడలి నర్సింహమూర్తి, యర్రంశెట్టి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడికి రూ.25 వేల సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

రావులపాలెం: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.26,871 సాయాన్ని ఆదివారం అందజేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన యల్లమెల్లి రాఫెన్సీ (23 నెలలు) అనే పాప బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుంది. కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో నెల రోజులు నుంచి చికిత్స పొందుతుంది. ఇప్పటికే ఒక సర్జరీ జరిగింది. ఇంకో సర్జరీ చేయాల్సి ఉంది. రోజుకి రూ.20 వేల వరకూ ఖర్చవుతుంది. అంత ఆర్థికస్తోమత లేక పాప తండ్రి యల్లమెల్లి చిట్టికిరణ్ స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో పాప పిన్ని పాము సమతకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.26,871 చెక్కు అందజేశారు.


రావులపాలెంలో చిన్నారి బంధువుకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

చంద్రబాబును ప్రజలు నమ్మరు

- మాజీ మంత్రి గొల్లపల్లి, పార్టీ అబ్జర్వర్ మట్టపర్తి
- మలికిపురంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర

మలికిపురం: ఇక భవిష్యత్తులో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాజోలు వైఎస్సార్ సీపీ అబ్జర్వర్ మట్టపర్తి నాగేంద్ర అన్నారు. మలికిపురం మండల స్థాయిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం పార్టీ కార్యాలయం ఆవరణలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా మాజీ సీఎం జగన్ నడిపారన్నారు. జగన్ హయాంలో ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ వచ్చి బాబు, పవన్ ప్రజలని మోసం చేశారన్నారు. ఏడాదిలో 1.04 లక్షలు ప్రతి కుటుంబానికి ఇస్తానన్నారన్నారు. ఎన్ని ఇచ్చారో ప్రజలే చెబుతారన్నారు. ఇక త్వరలో గ్రామగ్రామానా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో రాజోలు నియోజకవర్గానికి సముచిత స్థానం ఇచ్చారు. అదే స్థాయిలో మన పనితీరు వుండాలన్నారు. కార్యకర్తల పనితీరుపై నాయకత్వం పరిశీలిస్తుందన్నారు. ఏడాదిలో నియోజకవర్గంలో పార్టీని గాడిలో పెట్టుకున్నామన్నారు. పార్టీ పట్ల క్రమశిక్షణతో ఉండాలన్నారు. పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ జగన్ పాలన ఒక స్వర్ణ యుగమన్నారు. పార్టీ ఆదేశాలను పాటిద్దామన్నారు. మన పార్టీ సభలకు జనం వస్తున్న తీరు చూస్తుంటే ప్రభుత్వంపై ప్రజల్లో వున్న వ్యతిరేకత అర్థం అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పోరాటంతోనే అమ్మకు వందనం ఇచ్చారు. జగన్ ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిద్దామన్నారు.

మిధున్‌రెడ్డి అరెస్టు అక్రమం

ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమేనని గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ నిజాయితీ గల కుటుంబమని గతంలో ఒక సభలో పవనే అన్నారన్నారు. అరెస్టులకు భయపడడం ఉండదన్నారు. అన్యాయాలను ప్రజా కోర్టులోనే తేల్చుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీని అప్రతిష్ట పాలు చేయడానికే అరెస్టులు జరుగుతున్నాయన్నారు. సభలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, తెన్నేటి కిషోర్, కూనపరెడ్డి రాంబాబు, ఈద రవిరెడ్డి, పెన్మెత్స రంగరాజు, కుసుమ చంద్రశేఖర్, కలగత ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే..


మామిడికుదురు నూకాలమ్మ సారె


మొగలికుదురులో శాకంబరిగా పళ్లాలమ్మ


శాకంబరిగా పలివెల తాళ్లమ్మ


ర్యాలిలో శాకంబరిగా వాకులమ్మ

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ

మామిడికుదురు: మేళ తాళాలు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ భారీ ఊరేగింపుగా మామిడికుదురు గ్రామ దేవత నూకాలమ్మకు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులతో సారె తీసుకుని శివాలయం నుంచి 216వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సారె, పసుపు, కుంకుమ, పువ్వులు, చలివిడి, పానకాలు, వడపప్పు, గాజులు సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువగా జరిగింది. నూకాలమ్మతో పాటు మొగలికుదురు గ్రామంలోని జగ్గన్నపేటలోని పళ్లాలమ్మను, మాకనపాలెంలోని పాళ్లమ్మను పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. పలువురు భక్తులు అమ్మ వార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.


విలసలో శాకంబరిగా వనువులమ్మ

పలివెలలో..

కొత్తపేట: మండలంలోని పలివెల గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సమకూర్చిన కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో ఆలయ ఆసాదులు, మహిళలు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పలివెల పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతి భారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సత్యవాణి దంపతులు పులిహోర ప్రసాదం సమర్పించారు.

పి.గన్నవరంలో శాకంబరిగా తాటమ్మ తల్లి


శాకంబరిగా దర్శనమిచ్చిన తాటమ్మ తల్లి

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన గ్రామ దేవతలకు ఆదివారం భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.గన్నవరంలోని తాటమ్మ వారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. అలాగే బోడపాటివారిపాలెంలోని కొండాలమ్మ వారికి, తాటమ్మ వారికి ఆషాఢం సారె సమర్పించారు. భక్తులకు అన్న సమారాధన చేశారు. కొండాలమ్మ వారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఊడిమూడిలో కనక మహాలక్ష్మి, బంగారు పాపమ్మకి గ్రామస్తులు ఆషాఢం సారె సమర్పించి, పూజలు చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విలసలో..

అయినవిల్లి: విలస గ్రామదేవత వనువులమ్మ అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శన మిచ్చారు. అలాగే గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అయినవిల్లి గ్రామదేవత రావులమ్మకి, దూనబోయినపాలెంలోని కనకదుర్గమ్మకి గ్రామస్తులు సారె సమర్పించారు.

ప్రత్యేకాధికారుల పాలనతో ఇబ్బందులు

సఖినేటిపల్లి: ప్రత్యేకాధికారుల పాలనలో చేనేత సొసైటీల అభివృద్ధి కుంటుపడుతోందని, కార్మికుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ చింతా వీరభద్రేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడుకు, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు ఆయన వినతి పత్రాలను అందజేశారు. వ్యవసాయ పరపతి సంఘాలకు నామినేటెడ్ కమిటీలు వేసిన విధంగా చేనేత సొసైటీలకు కమిటీలు వేయాలని ఆ పత్రంలో కోరారు. అలాగే సొసైటీలకు ప్రభుత్వం బకాయి పడిన సొమ్ములను వెంటనే చెల్లించాలని, కార్మికులకు రావాల్సిన రాయితీలు విడుదల చేయాలన్నారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల తరువాత చేనేతలకు ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేయాలని కూడా ఆ పత్రంలో ఆయన పేర్కొన్నారు. వెంట చేనేత ప్రతినిధులు వి.గణేష్, వి.గణపతి పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు

రాజోలు: మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం సోంపల్లిలోని రామాలయం వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మత్స్యకారుల నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం పెంపు కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎమ్మెల్యే దేవ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా ప్రాథమిక మత్స్యకార సంఘాలను ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థగా మార్పు చేస్తామన్నారు. రాజోలు నియోజకవర్గంలో 36 మత్స్యకార సంఘాలు ఉన్నాయని వీటి ద్వారా 20 వేల మంది మత్స్యకారులకు ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. తొలుత సోంపల్లి కనకదుర్గ అగ్నికుల క్షత్రియ ఫిషర్ మన్ అండ్ బోట్స్‌మన్ కో–ఆపరేటివ్ సొసైటీ రాష్ట్రంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా లబ్ధి పొంది మొదటి సొసైటీగా నిలిచిందన్నారు. నిర్వహణ కోసం రూ.5 లక్షలు మంజూరు కాగా, రూ.66 వేలు సంఘ ఖాతాకు జమ అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పొన్నమండ శ్రీనివాసరావు, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సంకరపు ఆదినారాయణ, ఎఫ్‌హెచ్ కమిటీ సభ్యులు తిరుమల ఆచార్యులు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాసరావు, చాగంటి స్వామి, పొలమూరి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్